


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

ఆదివారం,
ఫిబ్రవరి 16, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-

## ఇప్పటికిప్పుడు
# బీసీ కోటా అసాధ్యం!

- పార్లమెంట్‌లో ఆమోదం పొందాకే 42% రిజర్వేషన్ల అమలు
- ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి
- మార్చి తొలివారంలో రిజర్వేషన్లపై తీర్మానం చేసి కేంద్రానికి పంపుతాం
- పార్లమెంట్‌లో ఆమోదింపజేసే బాధ్యతను కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తీసుకోవాలి
- రాహుల్‌గాంధీ నా బాస్.. ఆయన మాట తప్ప వేరెవరినీ లెక్క చేయనని వ్యాఖ్య
- ప్రధాని కులంపై ఎలాంటి తప్పుడు వ్యాఖ్యలు చేయలేదని వివరణ



న్యూఢిల్లీ: రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో ఇప్పటికిప్పుడు బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు సాధ్యం కాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు పార్లమెంట్ ఆమోదం తప్పనిసరని, వచ్చే నెల తొలివారంలో అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని తెలిపారు. పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే బాధ్యతను రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ బాధ్యత తీసుకోవాలని సవాల్ చేశారు. రాష్ట్రంలో సమగ్రంగా కులగణన చేపట్టామని, అది దేశానికే ఒక రోడ్ మ్యాప్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. కులగణనలో సేకరించిన వివరాల ఆధారంగానే కమిషన్ లేదా అధికారులతో కమిటీ వేసి భవిష్యత్తులో ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అయిన సీఎం రేవంత్‌రెడ్డి.. అనంతరం అక్కడి తుగ్లక్‌రోడ్డులోని తన నివాసంలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. వివరాలు ఆయన మాటల్లోనే... “మేం చేపట్టిన కులగణనలో బీసీలు ఆరు శాతం పెరిగారు. కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వేలో

(మిగతా 2వ పేజీలో)



# రూ.1 లక్షతో టికెట్ కొంటేనే నన్ను అనుమతించారు: సీఎం చంద్రబాబు

**ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మ్యూజికల్ నైట్.. టికెట్ కొని హాజరైన సీఎం చంద్రబాబు**

**ఎన్టీఆర్ ఎంత మొండి ఘటమో, భువనేశ్వరి కూడా అంతే మొండి ఘటం అని చమత్కారం**

ఎన్టీఆర్ ట్రస్ట్ విజయవాడలో నిర్వహించిన యుఫోరియా మ్యూజికల్ నైట్ కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తలసేమియా బాధితులకు సహాయం చేసేందుకు ఈ కార్యక్రమం ద్వారా నిధులు సేకరించాలన్న ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజ్ మెంట్ ను, సిబ్బందిని అభినందిస్తున్నానని తెలిపారు. ఈ మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని చూసిన తర్వాత ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరిపై మరింత నమ్మకం పెరిగిందని అన్నారు. హెరిటేజ్ ను సమర్థవంతంగా నడిపించడమే కాదు, ఈ ఎన్టీఆర్ ట్రస్ట్ ను కూడా సమర్థవంతంగా నడిపించే శక్తి ఆవిడకు తండ్రి నుంచి వచ్చింది అని వివరించారు. ఎన్టీఆర్ ఎంత మొండి ఘటమో, భువనేశ్వరి కూడా అంతే మొండి ఘటం అని చంద్రబాబు

(మిగతా 2వ పేజీలో)

**ఎన్టీఆర్ ట్రస్ట్ కు రూ.50 లక్షల భారీ విరాళం ప్రకటించిన పవన్‌కల్యాణ్**

- విజయవాడలో యుఫోరియా మ్యూజికల్ నైట్
- ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- హాజరైన పవన్ కల్యాణ్
- టికెట్ కొనకుండా వచ్చినందుకు గిల్టీగా ఉందని వెల్లడి

## న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట
# 15 మంది దుర్మరణం

మహాకుంభ్‌మేళా భక్తులతో కిక్కిరిసిన రైల్వేస్టేషన్



## ఇతర రాష్ట్రాలతో పోలిస్తే
# స్థిరాస్థి రంగం ఆశించిన స్థాయిలోనే ఉంది

- పర్యావరణ పరిరక్షణ కోసం పలు కీలక నిర్ణయాలు
- ప్రపంచానికే ఆదర్శంగా ఉండేలా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం : ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క



ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో స్థిరాస్థి రంగం ఆశించిన స్థాయిలోనే ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో ఐజీబీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రీన్ తెలంగాణ సమ్మిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,

(మిగతా 2వ పేజీలో)



## డొనాల్డ్ ట్రంప్ మరో ప్రకటన..
# ఏప్రిల్ 2 నుంచి అమలు!?

## రాహుల్ ఏ కులం, ఏ మతం
# అనేది రేవంత్ చెప్పాలి

రాజాసింగ్.. వ్యక్తి కోసం పార్టీ రూల్స్ మారవు: బండి సంజయ్





# దళితుడ్ని కిడ్నాప్ చేసినందుకు వంశీని అరెస్ట్ చేశారన్న లోకేశ్

తప్పు చేసిన వైసీపీ నేతలు తప్పించుకోలేరని స్పష్టీకరణ

# మోత్కూరు మండల కేంద్రంలో బిసి రిజర్వేషన్ పెంచాలని నిరసన

వార్తా మిర్రర్ మోత్కూరు ఫిబ్రవరి 15 : రాష్ట్రంలో ఉన్న జనాభా దామాషా ప్రకారం బీసీలకు అరవై శాతం కల్పించాలని బీసీ విద్యార్థి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు గడ్డం నర్సింహ్మా , బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 52% ఉన్న బీసీలను నుంచి 46% వరకు తగ్గింపు రాష్ట్ర ప్రభుత్వం చేయడాన్ని నిరసిస్తూ బీసీ విద్యార్థి ,యువజన సంఘం , బీసీ రిజర్వేషన్ సాధన సమితి సంఘాల ఆధ్వర్యంలో మోత్కూరులో మహాత్మ జ్యోతిరావు చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నర్సింహ్మా శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడుతూ గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం 2014 సం.. లో సమగ్ర కుటుంబ సర్వే 52% బీసీలు ఉన్నట్లు తేల్చితే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం 2025 సం.. లో (11 ఏళ్ల తర్వాత) బీసీలను 46% ఉన్నట్లు కులగణన సర్వే లో వెల్లడైనట్లు మంత్రి వర్గ ఉపసంఘం తెలియపర్చడం ఇది బీసీలను అవమాన పర్చడమేనని అన్నారు. ఎన్నిక సమయంలో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు అనేక హామీలు ఇస్తూనే తప్పా అమలు చేయడంలో పూర్తిగా విఫమైయ్యాయని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల మేమే ఊతం ఇస్తున్నట్లు గొప్పలు చెబుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నేడు గతానికి కంటే 6% తగ్గింపు చేయడమే కాకుండా అగ్రకులాలకు మరో 7% పెంచడంలో అంత్యర్యంమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల తగ్గింపు ను చూస్తే ఇటీవల చేసిన కులగణన పారదర్శకంగా జరగనట్లే స్పష్టం గా కనిపిస్తుందన్నారు. రాష్ట్రంలో మళ్ళీ కులగణన" చేసి పూర్తి స్థాయిలో బీసీలకు న్యాయబద్ధ వాటా తేల్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు కలిమెల నర్సయ్య, ఎడ్ల శ్రీను, దామరోజు సత్యనారాయణ, పులకరవు మల్లేశం, గొలుసుల యాదగిరి, బోయిని ఉప్పలయ్య వేముల నర్సయ్య , పసునూరి యాదయ్య, కోమటి లక్ష్మణ్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ ట్రస్ట్‌కు 50 లక్షల భారీ విరాళం ప్రకటించిన పవన్ కల్యాణ్

విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ నిర్వహించిన భారీ మ్యూజికల్ నైట్ కు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఎన్టీఆర్ ట్రస్ట్ కు రూ.50 లక్షల భారీ విరాళం ప్రకటించారు. ఈవెంట్ లో ఆయన ప్రసంగించారు. "ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు టికెట్ కొనాలని నాఇ సిబ్బందికి చెప్పాను. ఈ విషయం తెలిసి నారా భువనేశ్వరి గారు... టికెట్ ఎందుకండీ... మీరు కార్యక్రమానికి రండి చాలు అన్నారు. కానీ నాకు టికెట్ కొనకుండా రావడం గిల్టీగా అనిపిస్తోంది. అందుకే నా వంతుగా తలసేమియా బాధితుల సహాయార్థం ఎన్టీఆర్ ట్రస్ట్ కు రూ.50 లక్షల విరాళం ప్రకటిస్తున్నాను. నా దగ్గరికి కూడా కొందరు బాధితులు వస్తుంటారు. అలాంటి వారికి సాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గారి కార్యాలయానికి లేఖ రాస్తే ఆయన స్పందన అద్భుతంగా ఉంటుంది. ఎంత సేపూ పనేనా... సహాయంలోనూ వినోదం పొందవచ్చని ఈ మ్యూజికల్ నైట్ ద్వారా నిరూపించారు. ఈ కార్యక్రమానికి సంగీతం అందిస్తున్న మ్యూజిక్ డైరెక్టర్ తమన్ కు అభినందనలు. ఇక, నారా భువనేశ్వరి గారంటే నాకు అమితమైన గౌరవం. ఆమె ఎంత దృఢసంకల్పం ఉన్న వ్యక్తో నాకు తెలుసు. కష్టనష్టాల్లో ఆమె వెనుకంజ వేయకుండా నిలిచిన తీరు స్ఫూర్తిదాయకం. బాలకృష్ణ గారి గురించి చెప్పాలంటే... ఆయనను ఎప్పుడు కలిసినా సర్ అని పిలవాలనిపిస్తుంది. కానీ ఆయన మాత్రం బాలయ్య అని పిలువు అంటుంటారు. బాలకృష్ణ గారి వ్యక్తిత్వం చాలా ప్రత్యేకం... ఆయన ఎవరినీ లెక్క చేసే మనిషి కాదు. తాను అనుకున్న దానిపై గట్టిగా నిలబడతారు. తన నటనతో తరతరాలుగా ప్రేక్షకులను అలరిస్తున్నారు. అటు సినిమాలు, ఇటు సేవలు... అందుకే ఆయనకు కేంద్రం పద్మభూషణ్ ప్రకటించింది" అని పవన్ కల్యాణ్ వివరించారు.



# రాహుల్ ఏ కులం, ఏ మతం అనేది రేవంత్ చెప్పాలి

సిద్దిపేట: ముఖ్యమంత్రి రేవంత్.. ప్రధాని గురించి మాట్లాడే ముందు ఒక్కసారి ఆలోచించుకోవాలని హితవు పలికారు కేంద్రమంత్రి బండి సంజయ్. దేశ ప్రధాని ఎవరైనా ఆయనను బాధ్యతతో గౌరవించాలి. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఏ కులం, ఏ మతం అనేది రేవంత్ రెడ్డి చెప్పాలి అని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్ తాజాగా ఓ కార్యక్రమంలో మీడియాతో మాట్లాడుతూ.. 'మన దేశ ప్రధానమంత్రిని ఎవరైనా గౌరవించాలి. రేవంత్ బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారు. మోదీ కులాన్ని బీసీ జాబితాలోకి చేర్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే. దేశంలో 27 మంది బీసీ ఎంపీలను కేంద్ర మంత్రులుగా ప్రధాని మోదీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వే ప్రకారం 46 శాతం బీసీలు ఉన్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఎంత మంది బీసీలను మంత్రులుగా చేశారు?. అగ్రవర్ణాల్లో పేదలను మోదీ గుర్తించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీది ఏ కులం, ఏ మతం అనేది రేవంత్ రెడ్డి చెప్పాలి. రాహుల్ కుటుంబం గురించి చర్చ జరగాలి. కొరివితో తల గోక్కోవడం అంటే ఇదే. రాహుల్ గాంధీ కులం, మతం, దేశం మీద.. మూడు ఎమ్మెల్సీ ఎన్నికలకు వెళ్దామా?. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా డైవర్షన్ చేయడానికే ఈ చర్చ పెడుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఆరు గ్యారంటీలపై మాట్లాడటం లేదు. 317 జీవోపై మాట్లాడింది కేవలం బీజేపీ మాత్రమే. నిరుద్యోగ మార్చ్ చేసింది బీజేపీనే పార్టీనే. ఉద్యోగుల కోసం మేము పోరాటం చేశాం. పది శాతం ముస్లింలను తీసివేసి బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని కేంద్రానికి పంపితే మోదీని ఒప్పిస్తాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన స్థానాలలో ముస్లింలే గెలిచే ప్రమాదం ఉంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు అన్యాయం జరుగుతోంది. ఘోరమైన తప్పిదాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తోంది. కుల గణన సక్రమంగా చేస్తే రీ సర్వే ఎందుకు చేస్తారు?. కాంగ్రెస్ కుల గణన తప్పుల తడకగా ఉందన్నారు. ఇదే సమయంలో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అసంతృప్తి వ్యాఖ్యలపై బండి సంజయ్ స్పందించారు. ఈ క్రమంలో బండి సంజయ్ మాట్లాడుతూ..'వ్యక్తి కోసం పార్టీ రూల్స్ మారవు. పార్టీ అంతర్గతవిషయాల్లో కులాలు చూడరు. ఒక్క వ్యక్తిని ఉద్దేశించి పార్టీ నిర్ణయాలు మార్చుకోదు. ఏదైనా సమస్య ఉంటే పార్టీ దృష్టికి తీసుకెళ్లాలి. ఇలా బహిరంగంగా మాట్లాడటం కరెక్ట్ కాదు. రాజా సింగ్ మా పార్టీ ఎమ్మెల్యే ఆయనతో రోజు మాట్లాడతాను' అని అన్నారు.



## గడువులోగా ప్రాజెక్టులు పూర్తి చేయాలి

**అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు.. సమీక్షలో మంత్రి ఉత్తమ్ హెచ్చరిక**

**రాజస్తాన్‌లో జరిగే సదస్సు కోసం సమగ్ర నివేదిక సిద్ధం చేయాలి**



హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులనుఆదేశించారు. పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నీటిపారుదల శాఖపై శనివారం ఆయన జలసౌధలో సమీక్షించారు. రాజస్తాన్‌లో ఈ నెల 18, 19 తేదీల్లో జరగనున్న అఖిల భారత నీటిపారుదల శాఖ మంత్రుల సదస్సుకు రాష్ట్ర సాగునీటి రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు, డిజిటల్ మానిటరింగ్ వంటి అంశాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేయాలన్నారు. కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో జరగనున్న ఈ సదస్సు కేంద్ర ప్రభుత్వ విధానకర్తలు, నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురానుందన్నారు. నీటి నిర్వహణ, నిల్వల పెంపుదల, సాగునీటి సామర్థ్యం పెంపు వంటి అంశాలు ఈ సదస్సులో చర్చకు వస్తాయన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అవలంబిస్తున్న సూక్ష్మ సేద్యం, జలాశయాల్లో పూడికతీత, తక్కువ వ్యయంతో అధిక ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు అమలు చేస్తున్న ప్రణాళిక, నదుల పరిరక్షణ వంటి విధానాలను జాతీయ వేదికపైకి తెలియజేయాల్సిన అవసరముందని చెప్పారు. సదస్సులో రాష్ట్రం తరపున ఏర్పాటు చేయనున్న ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించడానికి గణాంకాలు, కేస్ స్టడీస్‌తో దృశ్యరూపాలను సిద్ధం చేయాలన్నారు. ఈ జాతీయ సదస్సులో తెలంగాణ నీటి పారుదల వ్యూహాన్ని దేశవ్యాప్తంగా ప్రదర్శించేందుకు గొప్ప వేదిక కానున్నట్టు ఉత్తమ్ చెప్పారు. గత ప్రభుత్వం అధిక నిధులు ఖర్చు చేసినా పరిమిత ఫలితాలనే సాధించిందని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ, డిండి, పాలమూరు%-%రంగారెడ్డి, దేవాదుల తదితర ప్రాజెక్టుల పురోగతిపై అధికారులు ఈ సమావేశంలో మంత్రికి నివేదిక సమర్పించారు.



## ట్రంప్ మరో ప్రకటన.. ఏప్రిల్ 2 నుంచి అమలు!?

జనవరి 20న పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అమెరికా అధ్యక్షుడు 'డొనాల్డ్ ట్రంప్' కీలక నిర్ణయాలను తీసుకుంటూ.. మిత్ర దేశాలను, శత్రుదేశాలను భయానికి గురిచేస్తున్నారు. పన్నుల విషయంలో తగ్గేదే లే అన్నట్లు.. సంచలన ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు తాజాగా దిగుమతి చేసుకున్న కార్లపై సుంకాలను ప్రకటించాలని యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్ల మీద మాత్రమేనా.. ఆటోమొబైల్ ఉత్పత్తుల మీద కూడా సుంకాలను విధిస్తారా? అనే విషయం తెలియాల్సి ఉంది. ఆదాయాన్ని పెంచడానికి, వాణిజ్య అసమానతలను పరిష్కరించడానికి సుంకాలు విధించడం అవసరమని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాలో అమ్ముడవుతున్న కార్లలో దాదాపు 50 శాతం ఆ దేశంలోనే తయారవుతున్నాయి. దిగుమతులలో సగం మెక్సికో.. కెనడా నుంచి వస్తున్నాయి. మిగిలిన సగం జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ, బ్రిటన్, ఇటలీ, స్వీడన్ దేశాలు దిగుమతి చేస్తున్నాయి. ఉక్కు, అల్యూమినియం దిగుమతి మీద 25 శాతం సుంకం ప్రకటించినప్పుడు.. ఫోర్డ్ సీఈఓ జిమ్ ఫర్లీ విమర్శించారు. ట్రంప్ తీసుకున్న నిర్ణయం కార్ల ధరలను విపరీతంగా పెంచుతుందని, మా సరఫరా గొలుసులకు కూడా అంతరాయం కలిగిస్తుందని అన్నారు. ట్రంప్ పరిపాలనలోనే చర్చలు జరిపిన యునైటెడ్ స్టేట్స్-మెక్సికో-కెనడా ఒప్పందానికి కూడా ప్రతికూలత కలుగుతుందని పేర్కొన్నారు. మార్చి 12 నుంచి ప్రారంభమయ్యే అన్ని ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై సుంకాలకు సంబంధించిన ప్రణాళికలను అధ్యక్షుడు ఇటీవల నిర్ధారించారు. అయితే డెట్రాయిట్ ఆటోమేకర్లు జనరల్ మోటార్స్, ఫోర్డ్, స్టెల్లాంటిస్ వంటి వాటికి ప్రాతినిధ్యం వహిస్తున్న అమెరికన్ ఆటోమోటివ్ పాలసీ కౌన్సిల్.. మెక్సికో కెనడాపై ప్రతిపాదిత సుంకాలను తగ్గించాలని ట్రంప్‌కు పిలుపునిచ్చింది.



## వైటిపిఎస్ ప్లాంట్‌లో ప్రమాదవశాత్తు గాయపడ్డ బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది

మిర్యాలగూడ ఫిబ్రవరి 15:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలోనీ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ కాలిన బూడిదలో ప్రమాద కాలిన ఐదుగురిని హైదరాబాద్ డిఆర్డిఓ అపోలో ఆసుపత్రిలో శనివారం రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అమిత్ ప్రమాదంలో కాలిన గాయాలకు గురైన వారిని మిర్యాలగూడ, దామరచర్ల తహశీల్దార్లు ఎన్.హరిబాబు, జవహర్ నాయక్, వైటిపిఎస్, జెన్‌కో, బీహెచ్ఈఎల్ అధికారులతో కలిసి గాయపడ్డ బాధితుల కుటుంబాలను కలిసి గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరినట్టు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అవసరమైన అన్నీ విధాల సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు.

## మిర్యాలగూడ మున్సిపల్ నక్ష సర్వే లో భాగంగా హెలికాప్టర్‌తో సర్వే తెలియక వింతగా చూస్తున్న ప్రజలు



మిర్యాలగూడ ఫిబ్రవరి 15:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ మునిసిపల్ పరిధిలో నక్ష కోసం రెండు రోజుల పాటు సాగిన సర్వే శనివారం సాయంత్రం ముగిసింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్బన్ ల్యాండ్ రికార్డ్స్ నిర్వహించాలన్న లక్ష్యంతో రాష్ట్రంలో 10 మున్సిపాలిటీలు అందులో మిర్యాలగూడ ఒకటి ఉండటంతో తొలుత డిజిపిఎస్ సర్వే చేసి 3 భాగాలుగా విభజించి హెలికాప్టర్, డ్రోణేలతో శుక్ర, శనివారాల్లో నిర్వహించారు. శుక్రవారం, శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నాలుగేసి హెలికోప్టర్, డ్రోన్ చక్కర్లు కొట్టాయి. తెలియని ఏమిటో అని ఆశ్చర్యంగా చూశారు. మొత్తం మీద సర్వే నంబర్లు, ఇంటి నంబర్ల మారనున్నాయి.

# ఇప్పటికిప్పుడు బీసీ కోటా అసాధ్యం!

4 కేటగిరీలు మాత్రమే చూపారు. అందులో బీసీలు 51 శాతం, ఎస్సీలు 18 శాతం, ఎస్టీలు 10 శాతంకాగా.. మిగతా వాళ్లను ఓసీలుగా చూపారు. మేం చేసిన సర్వేలో మొత్తం ఐదు కేటగిరీలుగా విభజించాం. మా సర్వే ప్రకారం హిందూ, ముస్లిం బీసీలంతా కలిసి 56 శాతం ఉన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం తీసుకొచ్చి, పార్లమెంట్ ఆమోదానికి పంపిస్తాం. కేసీఆర్ సర్వేలో ఎస్సీల్లో 82 కులాలున్నాయని చెప్పారు. కానీ ఉన్నవి 59 కులాలే. స్పెల్లింగ్ తప్పుగా ఎంట్రీ అయినా దాన్ని మరో కులంగా చూపారు. లేని కులాలను ఇప్పుడు చూపెట్టాలంటే నేను ఎక్కడి నుంచి తేవాలి? ఎవరు ఏమనుకున్నా, ఎలాంటి విమర్శలు చేసిన నేను పట్టించుకోను.

**ప్రధానిపై తప్పుడు వ్యాఖ్యలు చేయలేదు..**

1994లో ప్రధాని మోదీ లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అని నేను చెప్పాను. నేను చేసిన వ్యాఖ్యలను కూడా అంగీకరించాను. కాకపోతే తేదీ, సమయం విషయంలో కొంత తేడా వచ్చింది. కిషన్‌రెడ్డి చెప్పింది నేను అంగీకరిస్తున్నా.. ప్రధానిపై తప్పుడు వ్యాఖ్యలు చేయలేదు. ఆయన హోదాను తగ్గించలేదు. అగౌరవపరిచే విధంగా మాట్లాడలేదు.

**రాహుల్ గాంధీయే నా బాస్..**

కాంగ్రెస్ సీఎంగా నేను ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సూచన మేరకు నడుచుకుంటా. ఆయన మార్గదర్శకాలను తప్పకుండా పాటిస్తా. ఎవరు ఏమనుకున్నా, ఎలాంటి విమర్శలు, ఫిర్యాదులు చేసినా పట్టించుకోను. కేవలం రాహుల్ గాంధే నా బాస్. ఆయన చెప్పినట్టు నడుచుకుంటా. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ నాపై అనేక ఫిర్యాదులు, విమర్శలు వచ్చినా పట్టించుకోలేదు. రాహుల్ ఆదేశాల మేరకు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం ఏర్పాటు చేశాం. పీసీసీ, మంత్రివర్గ విస్తరణ అంశాల్లో కొందరు నాపై అబద్ధపు ప్రచారాలు, ఊహాగానాలు వ్యాప్తిచేసి పైశాచిక ఆనందం పొందుతున్నారు.."అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**శనివారం సంత్ సేవాలాల్**

జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి సీఎం రేవంత్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. బంజారా జాతికి ఆధ్యాత్మిక మార్గదర్శిగా సంత్ సేవాలాల్ మహరాజ్ నిలిచారని కొనియాడారు.

**ఫిరాయింపులపై సుప్రీంకోర్టు ఆదేశాలు పాటిస్తాం..**

పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఎలా వస్తుందో చూడాల్సి ఉందని.. ఈ విషయంలో అత్యున్నత న్యాయ స్థానం ఆదేశాలను పాటిస్తామని రేవంత్ చెప్పారు. కేటీఆర్ తానే కోర్టు అన్నట్టుగా మాట్లాడుతున్నారని, కోర్టు తీర్పు రాకముందే తీర్పులు ఇచ్చేస్తున్నారని విమర్శించారు. న్యాయ ప్రక్రియకు లోబడే ఈ విషయంలో ముందుకు వెళతామని తెలిపారు. అయితే దానం నాగేందర్ ఒక పార్టీలో గెలిచి మరో పార్టీ గుర్తుపై పోటీచేసిన రుజువులున్నాయి కదా అని మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా... 'గతంలో సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ ఏ పార్టీలో గెలిచారు? ఏ పార్టీలో మంత్రులుగా పనిచేశారు? నేను ఈ అంశంపై ఫిర్యాదులు చేసినా ఏం జరిగింది?'అని రేవంత్ పేర్కొన్నారు.

## రూ.1 లక్షతో టికెట్ కొంటేనే నన్ను అనుమతించారు: సీఎం చంద్రబాబు

చమత్కరించారు. నాడు ఎన్టీఆర్ ఏ విపత్తు వచ్చినా ఆదుకోవడంలో ముందుండేవారని కొనియాడారు. ఆయన స్ఫూర్తి మనలో ఉందని తెలిపారు. ఇవాళ ఈ కార్యక్రమంలో మాట్లాడే అవకాశం ఇచ్చిన ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని అన్నారు. ఇక, ఈ కార్యక్రమానికి వచ్చేందుకు తాను కూడా రూ.1 లక్షతో టికెట్ కొనుక్కుని వచ్చానని చంద్రబాబు వెల్లడించారు. టికెట్ కొనుక్కున్న తర్వాతే ఈ కార్యక్రమానికి అనుమతించారని సరదాగా వ్యాఖ్యానించారు. "నేను డబ్బులు చెల్లించింది ట్రస్ట్ కు కాదు... తలసేమియా బాధితులకు.... అదే నాకు తృప్తి. ఇవాళ వండ్రఫుల్ ఈవెనింగ్... ఇంక ఇంతకంటే ఎక్కువ మాట్లాడితే మీరు (సభికులు) నన్ను క్షమించరు... జై హింద్, జై ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్" అంటూ చంద్రబాబు ప్రసంగం ముగించారు. కాగా, విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన ఈ భారీ ఈవెంట్ కు నారా, నందమూరి కుటుంబ సభ్యులు హాజరై సందడి చేశారు.



## ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు

### - ముఖ్య అతిథిగా మున్సిపల్ మాజీ చైర్మన్.. ఎడ్మ సత్యం

కల్వకుర్తి ఫిబ్రవరి 15 వార్త మిర్రర్ ప్రతినిధి:– గిరిజన ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286 జయంతిని పురస్కరించుకొని మహబూబ్ నగర్ చౌరస్తా లో బిఆర్ఎస్ పార్టీ ఎస్టీసెల్స్ రాము నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిచండం జరిగింది. ముఖ్య అతిథిగా కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పాల్గొని వారు మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం అయినటువంటి సేవాలాల్ మహారాజ్ హిందూధర్మం గొప్పతనం బంజారాలకు తెలియజేయడానికి జన్మించిన మహానుభావునిగా గిరిజనులు భావిస్తారు.మనిషికి సహాయం చేసి,ప్రతిఫలం ఆశించొద్దని సేవాలాల్ మహారాజ్ అన్నారని తెలిపారు. మహరాజ్ చూపించిన మంచి మార్గంలో నడవడానికి బంజారాలు ముందు ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్ ఫోటో కు పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాటన్ మిల్ నాయకులు సూర్య ప్రకాశ్, మాజీ చైర్మన్ శ్రీశైలం,మాజీ వైస్ చైర్మన్ షాహెద్, పీఎసిఎస్ డైరెక్టర్ రాము నాయక్, నాయకులు మనోహర్ రెడ్డి, భవాండ్ల మధు,బొజి రెడ్డి, నూనె శ్రీను,సైదులు గౌడ్,మాధవ రెడ్డి, ముజ్జు, జంగయ్య, గోపాల్, వహిద్, ప్రశాంత్ రెడ్డి, మూర్తి,మల్లేష్, సత్యనారాయణ, పర్వతాలు, గోపాల్ నాయక్, గుండ్యా మాయక్, నిశాంత్ నాయక్, కుభ్య నాయక్, హన్మంత్ నాయక్, రంజిత్ నాయక్, పాండు నాయక్, రాజేందర్ నాయక్, వంశీ నాయక్, రాజు నాయక్, జితేందర్ నాయక్, భాస్కర్ నాయక్, యుగేందర్ నాయక్, తులసి రాం నాయక్, తిరుపతి నాయక్, సందీప్ నాయక్, అర్జున్ నాయక్, జంగిర్, హసన్, శేఖర్ గౌడ్, సూరి, పడకంటి శివ, భీమయ్య,గిరిజన నాయకులు,యువకులు తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :నడిగడ్డ తండాలో బంజారాల ఆరాధ్య దైవమైనటువంటి శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని గిరిజన సమక్షమ సంఘం ఆధ్వర్యంలో మరియు నడిగడ్డ తండ బంజారా యూత్ అసోసియేషన్ వారి సహకారంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నేషనల్ షెడ్యూల్ ట్రైబ్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ మరియు మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, డాక్టర్. రాంసింగ్, మోహన్ సింగ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా జాటోత్ హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ నడిగడ్డ తండా గిరిజనులు పడుతున్న ఇబ్బందులు చూశాననీ, మీకు సాధ్యమైనంత త్వరలో మీ సమస్యలు పరిష్కారం చేయడానికి కృషి చేస్తాననీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ తండా అధ్యక్షులు అల్వర్ స్వామి నాయక్, తిరుపతి నాయక్, సీతారాం నాయక్, హనుమంతు నాయక్, దసరత్ నాయక్, గోపి నాయక్, మోహన్ నాయక్, లక్పతి నాయక్, దేవా నాయక్, రెడ్యా నాయక్, యూత్ అధ్యక్షుడు దినేష్ నాయక్, సచిన్, శివ,లక్ష్మణ్, సాయి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## కెసిఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన

### రాజపేట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు -

### సటు తిరుమలేష్

రాజపేట, ఫిబ్రవరి 15(వార్త మిర్రర్): యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు సటు తిరుమలేష్ బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కెసిఆర్ సటు తిరుమలేష్ ని రాజపేట మండలంలో బిఆర్ఎస్ పార్టీ వివరాలు అడిగి తెలుసుకున్నారు.



## ఉర్సు ఉత్సవ వాల్ పోస్టర్ ఆవిష్కరించిన

## కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి

సంస్థాన్ నారాయణపూర్, ఫిబ్రవరి 15(వార్త మిర్రర్):యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలరాచకొండలో ఈనెల 24వ తేదీ నుండి రాచకొండ ఉర్సు ఉత్సాహాలు ప్రారంభం కాబోతున్నాయి కావున ఈ యొక్క ఉత్సవాలు గంధం కార్యక్రమంలో పాల్గొనాలని నారాయణపుర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి ని ఆహ్వానించిన ఉర్సు ఉత్సవ కమిటీ నాయకులు ఫయాజ్, సోహెల్, ఇమ్రాన్, మైనార్టీ నాయకులు రహీం షరీఫ్, ఇలియాస్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మందుగుల బాలకృష్ణ, పిఎసిఎస్ డైరెక్టర్ ఉప్పల కృష్ణ, చిలువేరు అంజయ్య, జక్కలి యాదయ్య యాదవ్, సురుకంటి జనార్దన్ రెడ్డి, రాచకొండ రమేష్ బాబు, చిలుకూరు శ్రీనివాస్, బద్దుల యాదగిరి యాదవ్, తదితరులు పాల్గొన్నారు

# సంక్షేమ పథకాలపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు దురదృష్టకరం

### అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యులు

### కొండమడుగు నర్సింహ



భువనగిరి, ఫిబ్రవరి15(వార్త మిర్రర్):సంక్షేమ పథకాలపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు దురదృష్టకరమని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) జాతీయ కౌన్సిల్ సభ్యులు కొండమడుగు నర్సింహ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలు శ్రామికుల శ్రమను, సామాజిక తరగతులను అవమానించే విధంగా ఉన్నాయని తెలిపారు. వాస్తవాల ఆధారంగా సుప్రీంకోర్టు తిరిగి పరిశీలించాలని కోరుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వాస్తవాలను సుప్రీంకోర్టు ముందుంచాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు ఇవ్వడంతో ప్రజలు ఇంటి దగ్గరే ఉంటున్నారాన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలు అత్యంత బాధను కలిగిస్తున్నాయన్నారు. వ్యవసాయ కార్మికులు , గ్రామీణ పేదలు, ఇతర కార్మికులు పని చేయకుండానే 2 లక్షల కోట్ల జీడీపీ వచ్చిందా ? దేశంలో 33 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు పని చేయకుండానే ఉత్పత్తయ్యాయా? అని నర్సింహ ప్రశ్నించారు.కోర్టు వాస్తవాలను పరిశీలిస్తే శ్రమ చేసే వారు కూర్చోవడానికి ఇష్టపడరనీ, గ్రామాల్లో పనులు లేక కోట్లాది మంది వలసలు వెళ్తున్నారనే విషయం అర్థమవుతుందని తెలిపారు. పట్టణాలలో వారి జీవితం ఎంత దుర్భరంగా ఉందో కోర్టుకు తెలియంది కాదని చెప్పారు. ప్రజా ప్రయోజనాల కేసులు వచ్చినప్పుడు న్యాయమూర్తులు అత్యున్నతంగా వ్యవహరించేవారనీ దురదృష్టకరంగా ఇటీవల కాలంలో కోర్టులు సామాజిక న్యాయం , మతసామరస్యం , శ్రమజీవులపై హేళనగా మాట్లాడుతున్న ఘటనలు చూస్తున్నామన్నారు. ఇది రాజ్యాంగస్ఫూర్తికి భిన్నంగా ఉన్నదని చెప్పారు. భారత రాజ్యాంగమన్న , న్యాయవ్యవస్థ అన్న తమకు గౌరవమున్నదనీ , కాకపోతే ఇలాంటి వ్యాఖ్యలు సామాజిక తరగతులను అవమానించే విధంగా ఉన్నాయని అన్నారు. శ్రమ చేసే వారికి రెండు ఎకరాల భూమి ఇస్తే రేషన్ కార్డులు అవసరం లేదని చెప్పారు. ఈ వ్యాఖ్యలు పున:పరిశీలించే విధంగా జోక్యం చేసుకోవాలని నర్సింహ విజ్ఞప్తి చేశారు.

# కడ్తాల్ లో ఘనంగా సేవాలాల్ జయంతి

- బంజారా లిపిని గుర్తించి భారత రాజ్యాంగంలో చేర్చాలి
- గ్రామపంచాయతీలను రెవిన్యూ మండలాలుగా గుర్తించాలని డిమాండ్
- బంజారా జాతి కోసం ప్రాణాలైనా అర్పిస్తా
- మాజీ జెడ్పిటిసి..జర్పుల దశరథ్ నాయక్





కల్వకుర్తి ఫిబ్రవరి 15 వార్త మిర్రర్ ప్రతినిధి:– గిరిజన ఆరాధ్య దైవం సద్గురు శ్రీ సేవలాల్ మహారాజ్ 286వ జయంతిని మునుపెన్నడు కనీ విని ఎరగని రీతిలో అంగరంగ వైభవంగా నిర్వహించిన కడ్తాల్ మండల బంజారా ముద్దు బిడ్డలకు అన్నదమ్ములకు అక్కాచెల్లెళ్లకు పెద్దలకు వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులకు లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో ఉన్న బంజారా ముద్దు బిడ్డలు పార్టీలకతీతంగా భారీ సంఖ్యలో పాల్గొని సేవాలాల్ జయంతిని విజయవంతం చేసినందుకు పేరుపేరునా ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. బంజారా లిపిని గుర్తించి భారత రాజ్యాంగంలో చేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే బంజారా గ్రామపంచాయతీని రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి నుండి మండలంలో గాని రాష్ట్రంలో ఎక్కడైనా సరే గిరిజనులకు ఎలాంటి సమస్య వచ్చిన తన ప్రాణాన్ని అడ్డుపెట్టి కాపాడుకుంటానని తెలిపారు.ఇప్పటినుండి గిరిజనులు ఎవరు చేతి కింద పని చేసి బతకాల్సిన అవసరం లేదని తన జాతిజనుల కోసం పోరాడాలని సూచించారు. సేవాలాల్ జయంతి సందర్భంగా గిరిజనుల ఐక్యతను చాటి చెప్పిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన నాయకులు జిల్లా గిరిజన నాయకులు మండల గిరిజన నాయకులు మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచులు మాజీ ఉపసర్పంచులు గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు

# శ్రీశ్రీశ్రీ స్తంభగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న

### సగర యువజన సంఘం నాయకులు





యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)

మర్రిగూడ మండలం శరంపేట్ గ్రామంలోని శ్రీ శ్రీ స్తంభగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని. ప్రత్యేక పూజలు నిర్వహించిన. సగర యువజన సంఘం నాయకులు. వార్త మిర్రర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గణేష్ సాగర్, మొగిలి జంగయ్య సాగర్, హరిదాస్ సాగర్, మొగిలి లక్ష్మణ్ సాగర్, కల్లెట్ల నర్సింగ్ సాగర్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరంపేట బ్రహ్మోత్సవాలు ప్రతి ఏటా బ్రహ్మాండంగా జరుగుతాయని. లక్ష్మీనరసింహస్వామి దర్శనంతో కోరుకున్న కోరికలు నెరవేరుతాయని ప్రజల నమ్మకం ఉంటుందని తెలిపారు. లక్ష్మీ నరసింహ స్వామి రాతి కట్టడాల గృహలో వెలిసిన స్వామిని దర్శించుకుని ప్రజలు పులకించిపోతారని తెలిపారు.



## కొండాపూర్ లో అక్రమ నిర్మాణాలు సీజ్

కొండాపూర్ వార్త మిర్రర్ : అనుమతులు లేకుండా విచ్చలవిడిగా అంతస్తులపై అంతస్తుల నిర్మాణాలు చేసిన పలు భవనాలను శనివారం శేర్లింగంపల్లి సర్కిల్ -20 టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండ నగర్ లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ జీషన్ ఇబ్బందితో కలిసి నాలుగు భవనాలను సీజ్ చేశారు. కాలనీలో మొత్తం 36 భవనాలను గుర్తించినట్లు, ఇప్పటికే నోటీసులు సైతం అందజేసినట్లు అధికారులు తెలిపారు. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని సందర్భంగా హెచ్చరించారు.

## అలరించిన వారంతపు సంస్కృతి కార్యక్రమాలు



మాదాపూర్ వార్త మిర్రర్ : మాదాపూర్ లోని శిల్పారామం లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం శ్రీమతి వై ఎస్ కళ్యాణి కూచిపూడి నృత్య ప్రదర్శన లో శివాష్టకం, బాలగోపాలా తరంగం అంశాలను ప్రదర్శించారు. మరియు శ్రీమతి భువనేశ్వరి బరిక్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ఆద్యంతం అలరించింది. ఝుమ్ ఝుమ్ తనన, నమశ్శివాయ, అన్నమాచార్య కీర్తన, వినాయక కౌతం, మూషిక వాహన, మండూక శబ్దం, రామదాసు కీర్తన అంశాలను అవని, దీపాలి, అక్షర, రసజ్ఞ, నిత్యశ్రీ, దీక్షిక, శ్లోక, సహన, ఇషాన్వి, శ్రీహిత, తాన్విక, అక్షయ మొదలైనవారు ప్రదర్శించారు. ప్రముఖ నాట్య గురువులు శ్రీమతి డాక్టర్ వనజ ఉదయ్ , మరియు డాక్టర్ కిరణ్మయి బోనాల విచ్చేసి కళాకారులను అభినందించారు.



## చిలువేరు వారి వివాహ వేడుకల్లో

## పాల్గొన్న -స్ఫూర్తి విద్యాసంస్థల చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రానికి చెందిన సిపిఐ మండల నాయకులు చిలువేరు అంజయ్య–అరుణ దంపతుల ఏకైక కుమారుడు మల్లికార్జున్–రాజేశ్వరి దంపతుల వివాహము శ్రీ రాఘవేంద్ర గార్డెన్%చ% ఫంక్షన్ హాల్ లోవారి వివాహానికి హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించిన స్ఫూర్తి విద్యాసంస్థల చైర్మన్, స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్, ఈ కార్యక్రమంలో నమస్తే తెలంగాణ రిపోర్టర్ పాష, కొండ గిరి గౌడ్, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు చిలువేరు బిక్షం, గిరి, డాక్టర్ లింగస్వామి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



## కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు ఉప్పల లింగస్వామిని సన్మానించిన మైనార్టీ సోదరులు

సంస్థాన్ నారాయణపుర్, ఫిబ్రవరి 15(వార్త మిర్రర్):

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ మండల కేంద్రంలో పేద ప్రజల సౌకర్యార్థం 24 గంటలు ఉచిత అంబులెన్స్ సేవలు అందించినందుకు కృతజ్ఞతగ గాను ఉప్పల లింగస్వామి ని ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేసిన మైనార్టీ సోదరులు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎండి ఫయాజ్ ఖాన్, మైనార్టీ నాయకుడు ఎండి రహీమ్ షరీఫ్,సోహేల్ ఖాన్, ఎండి ఇలియాస్ ఖాన్,ఇమ్రాన్ ఖాన్,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, పిఎసిఎస్ డైరెక్టర్ ఉప్పల కృష్ణ, చిలువేరు అంజయ్య,చిలకూరి శ్రీనివాస్, సురకంటి జనార్దన్ రెడ్డి,రాచకొండ రమేష్ బాబు, జక్కలి యాదయ్య యాదవ్, బద్దుల యాదగిరి యాదవ్, తదితరులు పాల్గొన్నారు





## వైటిపిఎస్ క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ ఫిబ్రవరి 15:- (వార్త మిర్రర్) దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలోనీ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లో వేస్ట్ ట్రీట్మెంట్ ప్లాంట్ లో జరిగిన ప్రమాదంలో వేడి బూడిద మీద పడి గాయపడి హైదారాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని హాస్పిటల్ కి వెళ్లి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ వారినీ పరామర్శించి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.అనంతరం బిహెచ్ఇఎల్ వారికి పవర్ మెక్ , కంట్రాక్టర్ సత్యనారాయణకు ఫోన్ చేసి గాయపడిన వారికి కావాల్సిన అన్ని వైద్య సేవలు దగ్గరుండి చూసుకోవాలని అన్నారు. అందులో తీవ్రంగా గాయపడిన ముగ్గురు కోలుకొని తిరిగి ఇంటికి వచ్చే వరకు కావాల్సిన అన్ని సదుపాయాలు అందించాలని ఆదేశించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.

## విలక్షణ నటుడు డా, రాజేంద్రప్రసాద్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖ ఫోటో వీడియో గ్రాఫర్ మహమ్మద్ జాంగిర్ షరీఫ్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)



తెలుగు చలనచిత్ర విలక్షణ నటుడు డా, రాజేంద్రప్రసాద్ ను చౌటుప్పల్ విలేజ్ హొటల్లో మర్యాదపూర్వకంగా కలిసిన, ఫోటోగ్రాఫర్ మహమ్మద్ జాంగిర్ షరీఫ్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సినిమా నటుడు, నిర్మాత, సంగీత దర్శకుడు. ఎక్కువగా హాస్య చిత్రాలలో కథానాయకునిగా నటించి మంచి హాస్యనటుడిగా పేరు తెచ్చుకున్నాడు. ఆయన నటించిన సినిమాలలో అహ నా పెళ్లంట, లేడీస్ టైలర్, అప్పుల అప్పారావు, ఏప్రిల్ 1 విడుదల, మాయలోడు మంచిపేరు తెచ్చిపెట్టాయి అని అన్నారు అతనిని కలవడం నాకు చాలా సంతోషంగా ఉందని మహమ్మద్ జాంగిర్ షరీఫ్ అన్నారు



## మహానీయుల ధర్మభిక్షం అడుగుజాడల్లో నడవాలని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి.

సంస్థాన్ నారాయణపుర్, ఫిబ్రవరి 15(వార్త మిర్రర్):ప్రజల గుండెచప్పుడు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మ బిక్షం అని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు, యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ మండల కేంద్రంలో గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో ధర్మ బిక్షం 103వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు,అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు,ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ నేటి యువత అలాంటి మహానీయుల అడుగుజాడల్లో నడవాలని అన్నారు, గీత పనివారాల సంఘాన్ని స్థాపించి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు చేశాడని కొనియాడారు,ఈ కార్యక్రమంలో యాదాద్రి జిల్లా కార్యదర్శి పందుల యాదగిరి గౌడ్,బద్దం యాదయ్య, నీల్ల గాలయ్య, రాపర్తి కరుణాకర్, మొగుదాల సత్తయ్య, పాలకూర్ల సతీష్,మాధగోని బాలరాజు, సుర్వి నరసింహ, సుర్వి యాదయ్య, తండా యాదయ్య, కురిమిద్ద శ్రీనివాస్, కలకొండ సంజీవ, పల్లె రాములు,చంద్రయ్య, ముత్యాలు,కృష్ణయ్య, మాధవులు, పద్మాచారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీల గెలుపు రాజకీయాలకు మలుపు

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో పూల రవీందర్ కి బీసీల మద్దతు

### బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



సంస్థాన్ నారాయణపూర్, ఫిబ్రవరి 15(వార్త మిర్రర్):ప్రస్తుతం జరిగే నల్గొండ, ఖమ్మం,వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి అయిన పూల రవీందర్ కి బీసీ ఉపాధ్యాయ ఉద్యోగ అంతా మద్దతు పలికి ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు సంస్థాన్ నారాయణపూర్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బీసీ సంఘాల నేతలతో కలిసి ఆయన మాట్లాడారు ఎన్నికలను వ్యాపారంగా మయంగా మార్చి బీసీ ఎస్సీ ఎస్టీలను మైనార్టీలను అన్ని ఎన్నికల్లో అగ్రకుల నేతలే గెలుస్తున్నారని ఓట్లు బీసీల వైతే అయిదు శాతం లేని అగ్రకులాల ఎలా గెలుస్తాయని ఈ ఎన్నికల్లో బీసీల ఐక్యతను చాటిచెప్పుతూ అగ్రకుల ఆధిపత్య రాజకీయాలకు తేలదించాలని బీసీలకు ఆయన పిలుపునిచ్చారు ఇప్పటికే రాష్ట్ర అసెంబ్లీలో 43 మంది రెడ్డి ఎమ్మెల్యేలు ఉన్నారని ఈ ఎన్నికల్లో మరొక రెడ్డిని గెలిపించి 44 మందిని చేయడం సరికాదని 60 శాతం ఉన్న బీసీలు కేవలం 19 మంది మాత్రమే ఉండాలని బీసీలను గెలిపించి చట్టసభల్లో బీసీల వానిని వినిపించేలా బీసీ సమాజం ఆలోచించాలని ఆయన అన్నారు.ఉపాధ్యాయ సంఘాలు మొత్తం అగ్రకుల అభ్యర్థులను ఈ ఎన్నికల్లో నిలబడ్డారని బిసి తరపున ఒకే ఒక్క అభ్యర్థి పూల రవీందర్ ఎన్నికల బరిలో నిలిచారని పూల రవీందర్ గెలిపించడం ద్వారా బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని ఆయన కోరారు.ఎమ్మెల్సీ ఎన్నికలు వ్యక్తుల మధ్య జరగడంలేదని బడుగుల ఆత్మగౌరవానికి అధిపతి కులాల రాజకీయ అధికారానికి మధ్యన జరుగుతున్న ఎన్నికలని ఈ ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని గెలిపిస్తే వచ్చే 2028 రాష్ట్ర రాజకీయాల చిత్రపటమే మారిపోతుందని బిసి అభ్యర్థి పూల రవీందర్ గెలవడం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు రాజకీయ అధికారం సిద్ధిస్తుందని భవిష్యత్తులో బీసీ నీతి ముఖ్యమంత్రి అవుతాడని ఆయన తెలిపారు. త్వరలోనే నల్గొండ ఖమ్మం వరంగల్ ఉమ్మడి జిల్లా పర్యటించి బీసీ అభ్యర్థికి గెలుపు కోసం కృషి చేస్తానని ఆయన ప్రకటించారు ఈ కార్యక్రమంలో..... బిసి యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు వీరమల్ల కార్తీక్ , బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి విజయ్ , బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు వెంకటేష్ గౌడ్, నీళ్ల లింగస్వామి, బీసీ యువజన సంఘం మండల ఉపాధ్యక్షులు కొల్లూరు నవీన్, జాజుల భాస్కర్, యాదగిరి, ప్రవీణ్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ (ఆర్ఆర్ డిసిఏ) ఆధ్వర్యంలో 52 వ తెలంగాణ రాష్ట్ర సీనియర్ ఇంటర్ - డిస్ట్రిక్ట్ కేరం టోర్నమెంట్ ప్రారంభం

టోర్నమెంటును ప్రారంభించిన తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి

ఎల్బీనగర్,15 ఫిబ్రవరి: రంగారెడ్డి జిల్లా కేరామ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుండి 18 వరకు తెలంగాణ రాష్ట్ర సీనియర్ ఇంటర్ డిస్టిక్ క్యారమ్స్ టోర్నమెంటును తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి ప్రారంభించారు. ఎల్బీనగర్, మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున్ నగర్ కమ్యూనిటీ హాల్ నాలుగు రోజుల పాటు కొనసాగనున్న 52 వ సీనియర్ ఇంటర్-డిస్ట్రిక్ట్ తెలంగాణ క్యారమ్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌ను రంగారెడ్డి డిస్ట్రిక్ట్ క్యారమ్ అసోసియేషన్ నిర్వహిస్తుందని, ఇందులో తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 130 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథులుగా ఆర్ ఆర్ డి సి ఏ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, మదన్ రాజు,(ఖజాంచి, ఏఐసిఎఫ్) ఉపాధ్యక్షులు పోగుల రాంబాబు, ఆదర్శ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి సత్యనారాయణ, చీఫ్ పేట్రోన్ కృష్ణారెడ్డి, క్యాట్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శోభన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.క్రీడాకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, ఉచిత భోజన మరియు వసతి సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు చెప్పారు.మొదటి రోజు మ్యాచ్ ఫలితాలుపురుషుల సింగిల్స్ %-% రెండో రౌండ్సాయి ఇశ్వర్ విజయం విద్యాసాగర్ పై %- 25-08, 25-09హేమంత్ (పెద్దపల్లి) విజయం శ్యామ్ కుమార్ పై %- 24-10, 18-08జయప్రసాద్ విజయం విక్రం కుమార్ పై %- 25-15, 14-25, 25-14సాగర్ విజయం వీరేందర్ బాబు పై %- 24-9, 25-5ఎస్.ఆదిత్య విజయం కె. శ్రీకాంత్ పై %- 25-01, 25-0విశాల్ విజయం శ్రీకృష్ణ పై %- 25-6, 25-09మహ్మద్ వసీం విజయం విశ్వజీత్ పై %- 25-0, 25-13ఎస్. నవీన్ విజయం వి. వెంకటేష్ పై 25-06, 25-06 విజయం సాధించారు.





## కల్లెట్ల వారి వివాహ మహొత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన

### యాదాద్రి జిల్లా సగర యువజన సంఘం నాయకులు

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)

మర్రిగూడ మండల కేంద్రంలో భారతి గార్డెన్స్ లో కల్లెట్ల యాదయ్య సాగర్-శారద కూతురి వివాహ మహొత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గోల్లూరి గణేష్ సాగర్, కల్లెట్ల నర్సింగ్ సాగర్, మొగిలి జంగయ్య సాగర్,గంట శివకుమార్, గంట సాయికుమార్,కల్లెట్ల ఆంజనేయులు, కల్లెట్ల వారి బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286 జయంతి ఉత్సవాలు

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) ఫిబ్రవరి 15మంగ్యా నాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని లోక్య నాయక్ తండాలో... సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286 జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమం లో తండా పెద్ద మనిషి భూక్య అర్జున్ నాయక్, కారోబార్ లావుడ్య కేవుడ్య దావు, అజ్మీరా మంగ్య నాయక్ .. తండా వాసులు నునావత్ బలరాం నాయక్, భుక్య శంకర్ నాయక్, మలోత్ రాజు నాయక్, అజ్మీర భూమా నాయక్, భూక్యా భిక్య నాయక్, లావుడ్య భూమా నాయక్, మాలోత్ బాపురావు నాయక్, మాలోత్ నాగరాజు, నునావత్ తిరుపతి, రాజు నాయక్, భరత్ నాయక్, కళ్యాణ్, వంశి, రాజెన్, రమేష్, చిన్ను, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.




## పట్టభద్రుల పరిష్కారానికి కృషి ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) ఫిబ్రవరి 15

పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని వీఎస్ గార్డెన్ లో పట్టభద్రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రుల ఓటు అనేది వజ్రాయుధం కంటే పదునైనదని, ఆగం కాకుండా ఆలోచించి ఓటు వేయండని పిలుపునిచ్చారు. మనం చదువుకున్న విజ్ఞులమని, పట్టభద్రుల శ్రేయస్సు కోరుకునే వాడినని ముఖ్యంగా ప్రజలతో ఉండేవాడిని ఎన్నుకోవాలన్నారు. ఎమ్మెల్సీఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వారి మెజార్టీతో గెలిపించాలని పట్టబద్రులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముసిపట్ల రాజేందర్, బ్రహ్మాండబేరి నరేష్, సత్యం, జగన్ మరియు 200 మంది పట్టభద్రులు పాల్గొన్నారు.



## ప్రభుత్వం ఆశావర్కర్లకు ఫిక్స్డ్ వేతనం చెల్లించాలి.... డిజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు బొజ్జ రమేష్

సికింద్రాబాద్, వార్తా మిర్రర్ ఫిబ్రవరి 15: రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం రూ. 18వేల వేతనం ఇవ్వాలని దళిత జన సమితి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, (డీజెకెవి) దళిత జన కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు బొజ్జ రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నియోజక వర్గం పరిధిలో (డీజేకెవీ) ఆధ్వర్యంలో హాస్పిటల్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో బొజ్జ రమేష్ మాట్లాడుతూ ఆశా వర్కర్లు ఎన్నో ఏండ్లుగా పనిచేస్తూ రోగులకు ఎన్నో సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఆశ వర్కర్ల సేవలను గుర్తించి వారికి ఫిక్స్డ్ వేతనం రూ. 18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే వారికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. అర్హులైన వారిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. పని భారం తగ్గించి వారంలో ఒక రోజు సెలవు ప్రకటించాలన్నారు. ఒక రోజులో 8 గంటల పని విధానం ప్రకటించి ఒక్కొక్కరికి బీమా పథకం కింద రూ. 25 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ పథకం కల్పించాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కరోనా కష్ట కాలం సమయంలో ఎంతోమందికి వారి యొక్క ప్రాణాలు ఫణంగా పెట్టి కరోనా పేషంట్లకు ఎంతో సేవలందించి ఎంతోమంది ప్రాణాలను కాపాడిన ఆశా వర్కర్ల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలని బొజ్జ రమేష్ కోరారు.



## విద్యార్థులకు టై, బెల్ట్, ఐడి కార్డుల వితరణ

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) ఫిబ్రవరి 15

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం శివాజీ నగర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శనివారం రామాజీపేట గ్రామానికి చెందిన వారి పారేపల్లి మురళి–శోభ రాణి దంపతులు శనివారం విద్యార్థులకు టై, బెల్టు, ఐడి కార్డులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు నవ్య శ్రీ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల తో సమావేశం నిర్వహించిన అధికారులు

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) ఫిబ్రవరి 15

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇందిరమ్మ ఇండ్లు కార్యక్రమములో భాగంగా తేది :- 15.02.2025 రోజున జగిత్యాల జిల్లా రాయికల్ మండలములోని ధర్మాజీపేట గ్రామములో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా గ్రామసభలో మంజూరు పొందిన 147 మంది లబ్ధిదారులతో సమావేశం నిర్వహించనైనది. ఇట్టి ఇండ్ల నిర్మాణమునకు సంబంధించి చర్చించడం జరిగినది. మరియు లబ్ధిదారులకు భూమి చదును చేసుకొనుటకు సూచనలు ఇవ్వడమైనది. ఇట్టి కార్యక్రమములో ఎంపిడిఓ శ్రీ బి.చిరంజీవి, ఎంపీవో కే సుష్మ, ఏఈ పి ఆర్ సీవీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి టీ రాజేందర్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



## ప్రశాంత్ నగర్ కాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి కార్పోరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి

ఎల్బీనగర్,15 ఫిబ్రవరి:వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ కాలనీలో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి పర్యటించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ కాలనీలో ఓపెన్ జిమ్ కావాలని కార్పొరేటర్ ని కోరారు. కాలనీ సంక్షేమ సంఘం పరిధిలో ఉన్న పార్కులు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, సంక్షేమ సంఘం సభ్యులు తీర్మానం చేసిన పార్కులను ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీ వాసుల కోరిక మేరకు కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి ఓపెన్ జిమ్ ఏర్పాట్లకు నిధులు మంజూరు చేసి వెంటనే జిహెచ్ఎంసి అధికారులతో చర్చించారు. సాధ్యమైనంత త్వరలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తానని కాలనీ వాసులకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు, కాలనీవాసులు గుర్రం గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మహాశివరాత్రి బ్రహ్మోత్సవ జాతర వాల్ పోస్టర్ ఆవిష్కరించిన-మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలి– పోస్టర్ ప్రచురణ కర్త రాపర్తి సురేష్ గౌడ్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం,కుమ్మరి ( శాలివాహన) వీధి,లో ఈ నెల 24 నుండి 27 వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల జాతర వాల్ పోస్టర్లు మాజీ ఎమ్మెల్సీ కర్నె కర్నే ప్రభాకర్, మాజీ సర్పంచ్ సికిలమెట్ల శ్రీహరి,పోస్టర్ల ప్రచురణకర్త, స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్, రాపర్తి సురేష్ గౌడ్ శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో,మాజీ ఎంపిటిసి కవిత విద్యాసాగర్,దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి చిలువేరు సాయిబాబా,కమిటీ సభ్యులు,గ్రామ ప్రజలు,కుల పెద్దలు బొడ్డుపల్లి గాలయ్య, చిలువేరు ముత్యాలు, చిలువేరు శంకర్, చిలువేరు శ్రీనివాస్ ,తెలంగాణ భిక్షం,గ్రామస్తులు తదితరులు.

# జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో అగ్రి ఇన్నోవేషన్ హబ్, అగ్రి హబ్, ఆగ్రిటెక్ మార్కెట్ ఆక్సెస్ కార్యక్రమం

**జగిత్యాల ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ పరిశోధనా స్థానం**





(తిరుమల శంకర్ రాయికల్ ప్రతినిధి) వార్త మిర్రర్ రాయికల్(తిరుమల శంకర్) ఫిబ్రవరి 15 అగ్రి ఇన్నోవేషన్ హబ్, గ్రామీన ఆవిష్కరణ స్పోక్స్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, జగిత్యాల ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో "అగ్ మాప్ ఆగ్రిటెక్ మార్కెట్ ఆక్సెస్ " కార్యక్రమయు న్విహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వ్యహసాయ కళాశాల, అసోసియేట్ డీన్ డా. భారతి నారాయన భట్ మేడం ముఖ్య అతిథిగా విచ్చేసి రైతులందరూ వివిధ స్థార్టప్ కంపెనీల ఉత్పత్తులను, సేవలను అర్థం చేసుకొని సద్వినియోగ పరుచుకోవాల్సిందిగా కోరారు. సహపరిశోధనా సంచాలకుల ఇన్చార్జ్, డా.బి.శ్రీనివాస్, శాస్త్ర వేత్త రూరల్ ఇన్నావేషన్ స్పోక్స్ అందించే సేవలను/కార్యక్రములను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని సంచించారు. అగ్రి హబ్ హబ్, సీఈఓ విజయ్ ఆగ్రి హబ్ కార్యక్రమాలను క్లుప్తంగా వివరించారు. జయప్రకాశ్, ఏజీమ్, నాబార్డ్ , కరీంనగర్, నాబార్డ్ అందించే సహాయాన్ని వివరించారు. డా.డి.ఎ. రజనిదేవి, శాస్త్రవేత్త మరియు రూరల్ ఇన్నావేషన్ స్పొక్, జగిత్యాల ఇంఛార్జ్, రైతు ఉత్పత్తి దారుల సంఘంల సభ్యులు, స్టార్టప్ కంపెనీల ఉసేవలను ఉపమోగించుకొనేందుకు గ్రామా అవిష్కరణ ప్యాప్తి అందించే సహాయాన్ని వివరించారు. తర్వాత డెల్టా థింగ్స్, రెయ0ట్, జీపి ఏవెన్స్, థానోస్ మెషీన్స్ టెక్నాలజీస్, మరియు "ఆసిల్లో మెషన్స్ పార్టప్ కంపెనల ప్రతినిధులు వారి ఉత్పత్తులను క్లుప్తంగా పవర్ పాయింటు ప్రెసెంటేషన్ ఇచ్చారు. తర్వాత రైతులు సందేహాలను శాస్త్రవేతులు, ఆగ్రిహబ్ సిబ్బంది మరియు స్టార్చప్ కంపెనీల ప్రతినిధులు వివరించడం జరిగింది. అనంతరం స్టార్టప్ కంపెనీల ఉత్పత్తులయిన రోబోట్ మరియు డ్రోన్స్ ని క్షేత్రాలలో ప్రదర్శన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కరింనగర్, సిరిసిల్ల – కామరెడ్డి జిల్లాలలోని 11 రైతు ఉత్పత్తిదారుల సంఘంల సిఈఓ 'కే , బిఓడి 'ఎస్ సభ్యులు మరియు రైతులు, మహిళా సంఘాల మహిళలు (110 మంది) పాల్గొన్నారు. అదేవిధంగా ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, రూరల్ ఇన్నావేషన్ స్పోకు, రూరల్ కోఆర్డినేటర్ రంజిత్ కుమార్, అగ్ హబ్, ప్రాజెక్ట్ మేనేజర్, ముఖేశ్, అగ్రిహబ్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# రాష్ట్రంలో కులగణనను పరిపూర్ణం చేద్దామని ప్రజలకు దాసు సురేశ్ పిలుపు

**పార్టీల పదవుల్లో బీసీ నేతల భాగస్వామ్యమెంత.. బీసీల ఎదుగుదలను ఓర్వలేకపోతున్న ప్రధాన పార్టీలు....**

**కులగణనపై విముఖత చూపడం రాజకీయ ద్వంద వైఖరే.**

**దాసు సురేశ్ . వ్యవస్థాపక అధ్యక్షులు**

**బీసీ రాజ్యాధికార సమితి ...**



హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి....ప్రభుత్వం మిగిలిపోయిన కుల గణనను ఆదివారం నుండి మరలా నిర్వహించడానికి సమాయత్తమవడం శుభ పరిణామమని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకొని సమీప గ్రామ పంచాయతీలలో , టోల్ ఫ్రీ నెంబర్ లేదా ప్రభుత్వ వెబ్సైట్ లో తమ వివరాలను నమోదు చేసుకొని భవిష్యత్తులో తమకు రావాల్సిన పథకాలను, అవకాశాలను అందిపుచ్చుకోవాలని దాసు సురేష్ కోరారు..కుల గణనపై విముఖత చూపడం రాజకీయ పార్టీలకు సరికాదని బీసీలు తమ అవకాశాల్ని అందుపుచ్చుకోవడానికి కులగణన గణనీయంగా ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో కులగణన ఆధారంగానే పథకాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రాజకీయ పార్టీలు జరిగే కులగణనపై రాద్ధాంతం చేయడం మాని కులగణన సంపూర్ణంగా పూర్తయ్యే సహకరించాలన్నారు. పార్టీల సభ్యత్వాలలో, సమావేశాలలో ముందు వరుసలో ఉంటున్న బీసీలకు ఆయా పార్టీల పదవుల్లో మాత్రం సరైన ప్రాధాన్యత దక్కడం లేదని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రతిపక్ష ప్రధాన పార్టీలలో ప్రాతినిధ్యపు భాగస్వామ్యం బీసీ నేతలకు లేకపోవడం విచారకరమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారిక కాంగ్రెస్ పార్టీ త్వరలో ప్రకటించబోయే పార్టీ పదవుల్లో మంత్రివర్గంలో ఎమ్మెల్సీ స్థానాల్లో సైతం బీసీలకు తప్పకుండా 42 శాతం పైచిలుకు అవకాశాలను కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రి చేస్తామన్న బిజెపి పార్టీ కనీసం బీసీ నాయకుడిని రాష్ట్ర అధ్యక్షులుగా గాని అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ గా కూడా నియమించకపోవడం శోచనీయమన్నారు.. బీసీల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్న టిఆర్ఎస్ పార్టీ సైతం ఆ పార్టీ అధ్యక్ష పదవికి శాసన సభాపక్ష నేత పదవుల్లో బీసీలను నియమించకపోవడం బీసీల పట్ల వారి కుటిల నీతిని తలపిస్తుందన్నారు.బీసీల ఎదుగుదలను ఓర్వలేకనే ప్రధాన పార్టీలు ఆయా పార్టీలలో కేవలం అప్రధాన్య పదవులకు మాత్రమే బీసీ నాయకులను పరిమితం చేస్తున్నారని ఆరోపించారు.. బీసీ ఉద్యోగులు వ్యాపారస్తులపై కొనసాగుతున్న దాడులు సైతం ఇందుకు నిదర్శనం అన్నారు.పార్టీలలో బీసీ నాయకత్వంపై కొనసాగుతున్న వివక్షను ఆయా పార్టీల బీసీ నాయకులు క్షుణ్ణంగా గమనిస్తున్నారనీ, ప్రధాన పార్టీల విధానాలు ఇదేవిధంగా కొనసాగితే బీసీలు త్వరలోనే తమ సొంత గూటిని ఏర్పాటు చేసుకోవడం తథ్యమని ఉద్ఘాటించారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన-డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వరిగంటి కృష్ణ గౌడ్ గారి తండ్రి వరిగంటి వెంకటయ్య గౌడ్ ఇటీవల మృతి చెందగా వారి నివాసానికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించి. ఆ నిరుపేద కుటుంబానికి 5000/వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. బిఆర్ఎస్ జిల్లా నాయకులు సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, ఈ కార్యక్రమంలో వరిగంటి రమేష్ గౌడ్, రాంపల్లి అరుణ్ కుమార్, వరిగంటి శ్రీనివాస్ గౌడ్, వరిగంటి భాస్కర్ గౌడ్, బాలయ్య గౌడ్ చంద్రయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు



## తోటకూర వారి వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన

### బిఆర్ఎస్ జిల్లా నేత డా,ర్యాకల శ్రీనివాస్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)

చెల్లేరు గ్రామానికి చెందిన తోటకూర నర్సమ్మ-రాజయ్య కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన, యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ నాయకులు, సామాజికవేత్త, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్. ఈ కార్యక్రమంలో తోటకూర రాజయ్య బంధుమిత్రులు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## చిలువేరు వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి

సంస్థాన్ నారాయణపూర్, ఫిబ్రవరి 15(వార్త మిర్రర్):యాదాద్రి భువనగిరి జిల్లాసంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రానికి చెందిన సిపిఐ మండల నాయకులు చిలువేరు అంజయ్య – అరుణ దంపతుల ఏకైక కుమారుడు మల్లికార్జున్ – రాజేశ్వరి దంపతుల వివాహము శ్రీ రాఘవేంద్ర గార్డెన్%ఄ% ఫంక్షన్ హాల్ లో వారి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామిఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మందుల బాలకృష్ణ, నోముల మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ కొన్ రెడ్డి నరసింహ, రాచకొండ రమేష్ బాబు, చిలుకూరి శీను, చిలువేరు అంజయ్య, పాలకూర స్వామి గౌడ్, బద్దుల మురళి యాదవ్ తదితరులు



## శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( ధనుంజయ్ నేత ) ..ఫిబ్రవరి :15..

మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మరియు మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లెనిన్ నగర్ లో బంజారా సోదరులు ఏర్పాటు చేసిన శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న టిటిపిసిసి ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన సోదరుల హక్కుల కోసం దేశమంతటా పర్యటించి వారి హక్కుల సాధన కోసం పోరాడిన మహనీయుడు శ్రీ సంత్ సేవా లాల్ మహారాజ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, గజ్జల రామచంద్రం కాంగ్రెస్ పార్టీ నాయకులు పోరెడ్డి భాస్కర్ రెడ్డి, గట్టు బాలకృష్ణ, ధరావత్ స్వామి నాయక్, జటావత్ రవి నాయక్, ఆర్ శీను నాయక్, కే శ్రీను నాయక్, జెల్ల రమేశ్ గౌడ్, ఓర్సు స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రిలో బలపడుతున్న సిఐటియు

## రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజరెడ్డి





మందమర్రి ఫిబ్రవరి 15: వార్త మిర్రర్ ప్రతినిధి : ఏరియాలోని వివిధ గనులు, డిపార్ట్మెంట్లలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రోజురోజుకు కార్మికులలో బలోపేతం అవుతుందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజ రెడ్డి స్పష్టం చేశారు. ఏరియాలోని సివిల్ డిపార్ట్మెంట్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచిన సంఘాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను స్ట్రక్చర్ సమావేశాల ద్వారా మాట్లాడి పరిష్కరించాల్సి ఉండగా ఎన్నికల కోడ్ ఉన్నదని దాటవేస్తున్నారని ఆయన మండిపడ్డారు. గతంలో ఎన్నికల కోడ్ లేని సమయంలో ఎందుకు మాట్లాడి పరిష్కరించలేదని ఆయన ప్రశ్నించారు. సివిల్ కార్మికుల సిబ్బంది కొరతను తీర్చాలని, వారి డిసిగ్నేషన్ కి సంబంధించి పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళ సిబ్బందిని డిపార్ట్మెంట్లో వాడుకుంటామని యాజమాన్యం చెబుతుందని దానివలన వారి ఆక్టింగ్ ప్యానెల్ కు ఇబ్బంది రాకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా సివిల్ పిట్ సెక్రటరీ రాజ్ కుమార్, కుమార్ యాదవ్ ల ఆధ్వర్యంలో ఫిట్టర్ కె శ్రీనివాస్, పంపు ఆపరేటర్లు సత్తయ్య, మహేందర్, వాల్వ్ ఆపరేటర్ బి కుమారస్వామి, శంకర్, రాజశేఖర్ రెడ్డి, ప్రవీణ్, సాంబశివుడు లు యూనియన్ లో చేరగా వారికి యూనియన్ అధ్యక్షులు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు సాంబారు వెంకట స్వామి, అల్లి. రాజేందర్ ఉపాధ్యక్షులు రామగిరి రామస్వామి, సీనియర్ నాయకులు అలవాల సంజీవ్, ఆర్గనైజర్లు సంకె వెంకటేష్, సురేష్, శ్రీనివాస్, నాగరాజు సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు దూలం శ్రీనివాస్ తో పాటు సివిల్ కార్మికులు పాల్గొన్నారు.

# ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

## బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్



మందమర్రి ఫిబ్రవరి 15: వార్త మిర్రర్ ప్రతినిధి : పట్టణంలోని మార్కెట్ ఏరియాలో రోడ్లు, మురుగు కాలువలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వ్యాపారస్తులపై కఠిన చర్యలు చేపట్టాలని బహుజన సమాజ్ పార్టీ చెన్నూరు నియోజకవర్గం అధ్యక్షులు ముల్కల రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆవరణలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్కెట్ ప్రాంతంలో బడా వ్యాపారస్తులు రోడ్లు కాలువలను ఖాళీ స్థలాలను ఆక్రమిస్తూ బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారని మున్సిపల్ చట్టాలంటే వీరికి లెక్క లేదని ఆయన మండిపడ్డారు. నిబంధనలు అతిక్రమించిన వ్యాపారస్తులపై చర్యలు తీసుకొని ఆక్రమణలు తొలగించాలని కోరారు. పట్టణంలోని మార్కెట్ లోని రామకృష్ణ మెడికల్ షాప్ నుండి అజయ్ క్లాత్ స్టోర్ క వరకు గల పాత కాలువపై అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను తొలగించి కాలువను పునర్నిర్మాణం చెయ్యాలనీ, షాపుల ముందు గల కాలువను ఆక్రమించడం వల్ల వర్షపు నీరు పోకుండా ఉన్నటువంటి నిర్మాణాలను తొలగించాలనీ, స్టేట్ బ్యాంక్ ముందు గల ఖాళీ స్థలంలో ప్రజల సౌకర్యార్థం గ్రంథాలయం నిర్మించాలనీ, కూరగాయల మార్కెట్ లో రోడ్డును వెడల్పు చేసి రద్దీని నివారించాలని, గంప శంకరయ్య, జి మార్ట్, రాజయోగి షాపింగ్ మాల్ ప్రక్కన ప్రజల సౌకర్యార్థం విశాలమైన రోడ్లు ఉండేవని వాటిని ఆక్రమించి బహుళ అంతస్తులు నిర్మాణాలు చేపట్టారని వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు కు అంద చేయగా ఆయన సానుకూలంగా స్పందించి అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాజుల శంకర్, ఎండి మతిన్ ఖాన్ , బొర్లకుంట రాయలింగు లు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలి

## మున్సిపల్ కమిషనర్ రాజలింగు








మందమర్రి ఫిబ్రవరి 15: వార్త మిర్రర్ ప్రతినిధి : విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి చేరాలని మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు అన్నారు. పట్టణంలోని కార్మెల్ హై స్కూల్లో శనివారం నిర్వహించిన స్పోర్ట్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువులోనే కాకుండా తమకు నచ్చిన క్రీడల్లో మెలకువలు తెలుసుకొని ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలన్నారు. శరీర దారుఢ్యనికి,మానసికొల్లాసానికి క్రీడలు దోహద పడతాయని అన్నారు. అనంతరం క్రీడల్లో బాగంగా 200 మీటర్ల పరుగు పందాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. క్రీడల్లో భాగంగా విద్యార్థులకు 400 మీటర్స్, 200 మీటర్స్, 100 మీటర్స్ పరుగు లాంగ్ జంప్ షాట్ పుట్ ఆటల పోటీలను నిర్వహించారు. అంతకు ముందు పాఠశాల విద్యార్థులు సిఈఆర్ క్లబ్ వద్ద క్రీడాజ్యోతిని వెలిగించి కార్మెల్ పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్మెల్ పాఠశాల హెడ్మాస్టర్ ఫాదర్ డాక్టర్ జేవిఆర్ రెక్స్, పిఈటి లు కే అమర్, కే కృష్ణ , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

# శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( ధనుంజయ్ నేత ) ..ఫిబ్రవరి :15 : మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట్ లేనిన్ నగర్ మరియు జిల్లేల్ గూడ మిథుల నగర్ లలో గిరిజన సోదరులు ఘనంగా నిర్వహించన శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలకు ముఖ్యాతిథిగా తనయుడు యువకులు పట్లోళ్ల. కౌశిక్ రెడ్డి తో కలిసి విచ్చేసి గిజన సంప్రదాయ పద్ధతిలో పూజా కార్యక్రమాల నిర్వహనలో పాల్గొన్న మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గము శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ :- సంత్ సేవలాల్ జయంతి అధికారికంగా నిర్వహించేలా కార్యక్రమాలు మొదలుపెట్టిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కి ధన్యవాదాలు తెలిపారు. లిఅలాగే గిరిజన సోదరులు రాజకీయాల్లో ఎదగాలని వారి పాలన వల్లే చేసుకునే విదంగా 3 వేలకు పైగా తాండలను గ్రామ పంచాయితీలుగా చేసి గిరిజన అభ్యున్నతికి పాటుపడ్డ గొప్ప వ్యక్తి కేసీఆర్ రని కొనియాడారు. 10% రిజర్వేషన్లు ఇచ్చి విద్యా ఉద్యోగలలో అవకాశాలు కల్పించిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. నగరం నడిబొడ్డున బంజారాహిల్స్ లో బంజారా ఆత్మగౌరవ భవనం నిర్మించి బంజారాలు ఏ కార్యక్రమమైన నిర్వహించుకునేల విదంగా సౌకర్య వంతంగా నిర్మించి ఇచ్చిన కెసిఆర్ ని ఎన్నడూ మా బంజారా బిడ్డలు మరువొద్దని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు,మరియు నాయకులు,కార్యకర్తలు, గిరిజన సోదర సోదరి మనులు, తదితరులు పాల్గొన్నారు.





## శ్రీ రాజరాజేశ్వర దేవస్థాన శాశ్వత అన్నదాన ట్రస్ట్ నూతన కార్యవర్గం ఎన్నిక

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్)ఫిబ్రవరి 15 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ శ్రీ రాజరాజేశ్వర స్వామి శాశ్వత అన్నదాన ట్రస్ట్ 2025 కు సంబంధించిన అన్నదాన నిర్వహణ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించడం జరిగింది. అధ్యక్షులు గా దాసారపు వేణు, ప్రధాన కార్యదర్శి గా అంగడి పరమేశ్వర్, ఉపాధ్యక్షులు గా రేండ్ల రాజం, సంయుక్త కార్యదర్శి గా వేల్పుల ప్రవీణ్, కోశాధికారి గా గొడ్డండ్ల చిన్న రాజగోపాల్ లను ఏకగ్రీవంగ ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం లో అన్నదాన ట్రస్ట్ సభ్యులు పాల్గొనడం జరిగింది



## ఓయూ లో ఘనంగా సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

సికింద్రాబాద్,వార్త మిర్రర్ ఫిబ్రవరి 15... గిరిజనుల ఆరాధ్య దైవం ఆధ్యాత్మిక గురువు శ్రీ శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ 286 వ జయంతి వేడుకలు ఓయూ లో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా సేవాలాల్ మహారాజ్ కి భక్తిశ్రద్ధతో పూజ చేసి పూజతో పాటు రాష్ట్ర ప్రభుత్వం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా పూజ చేసుకునేందుకు ఉద్యోగస్తులకు విద్యార్థులకు సాధారణ సెలవు ఇచ్చినందుకు సెలవు దినాన్ని సద్వినియోగం చేసుకుంటూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం ఓయూ ఆర్ట్స్ కాలేజీ పరిసర ప్రాంతాలలో ఇస్లావత్ వెంకన్న రాక్ ఆర్టిస్ట్ ఓయూ కాంట్రాక్ట్ ఉద్యోగి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ బంజారా జాతి హక్కుల కోసం మరియు సమాజ సేవ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన బ్రహ్మచారి కుల మత భేదాలు లేని సమాజం కోసం కృషి చేసిన మహనీయుడు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ నాయక్ , గణేష్ నాయక్ ,చరణ్ నాయక్ ,రవి నాయక్, కళ్యాణ్ నాయక్ ,సందీప్ నాయక్ రమేష్ నాయక్ , తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఈనెల 16న ఆయుర్వేద వైద్య శిబిరం

మందమర్రి ఫిబ్రవరి 15: వార్త మిర్రర్ ప్రతినిధి ఏరియాలోని సిఈఆర్ క్లబ్ లో ఈ నెల 16న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సింగరేణి యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం ఉదయం 10 నుండి సాయంత్రం 6:00 వరకు మాతా రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద, హైదరాబాద్ వైద్యులు విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని, ఈ వైద్య శిబిరానికి ఇంతకు ముందు హాజరైన వారు, కొత్తగా వైద్యం కోసం వచ్చే వారు అందరూ హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని యజమాన్యం కోరింది.



## దివ్యంగులకు అండగా నిలుస్తున్న మహేశ్వరం ఎమ్మెల్యే.సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( ధనుంజయ్ నేత ) ..ఫిబ్రవరి :15.. అంగవైకల్యం ఆటంకాలుగా భావిస్తూ నిరాశ నిస్పృహలతో కృంగిపోతున్న దివ్యంగులకు మనోదర్యం నింపుతూ వారి జీవితాల్లో చిగురాశలు పూయించే ప్రయత్నంలో భాగంగా తనవంతు కృషిగా బ్యాటరితో నడిచే మూడు చక్రాల వాహనాలను అందజేసిన ఆప ద్బాందువురాలు మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు పి.సబితా ఇంద్రారెడ్డి ఈ సందర్భంగా దివ్యంగులు మాట్లాడుతూ మాకు విధి అన్యాయం చేసినాసరే దేవతలా మా పరిస్థితులను అర్థం చేసుకోని మాకు అండగా నిలుస్తున్న సబి తమ్మ కి రుణపడి ఉంటామని సంతోషం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు,బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులుపాల్గొన్నారుపాల్గొన్నారు



## మిర్యాలగూడ మండలంలో ఎంపీటీసీ, జడ్పిటీసి ఎన్నికలకు 99 పోలింగ్ కేంద్రాలు

మిర్యాలగూడ , ఫిబ్రవరి 15:-(వార్తమిర్రర్) : ఎంపీటీసీ జెడ్పిటిసి 2025 ఎన్నికలు నిర్వహించుట కొరకు పోలింగ్ కేంద్రాల తుది జాబితా శనివారం మండల ప్రజా పరిషత్తు కార్యాలయములో ప్రజల కోసం నోటీసు బోర్డుపై పెట్టామని ఎంపీడీఓ ఎం.శేషగిరిశర్మ తెలిపారు . మండలము యందు 19 ఎంపీటీసీ స్థానములు ఉన్నవన్నారు అందులో 27,488 మంది పురుషులు, 28,467 మంది స్త్రీలు, 7 ఇతరులు మొత్తం 55,962 మంది ఓటర్లు నమోదు అయి ఉన్నారన్నారు. మిర్యాలగూడ మండలంలో మొత్తం 99 పోలింగ్ కేంద్రములు ఏర్పాటు చేశామన్నారు.